నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం | జనవరి 11, 2024 | www.navatelangana.com

మేయర్ గన్‌మెన్ తొలగింపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ గన్ మెన్ల తొలగింపు అంశం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గన్‌మెన్‌ల కేటాయింపుపై పలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే మొన్నటి వరకు మేయర్ కు 1/1 చొప్పున గన్ మెన్‌లు రక్షణగా ఉన్నారు. మూడ్రోజుల కిందట పోలీసు శాఖ వీరిని ఉపసంహరించుకుంది. అలాగే వారిని తొలగించినట్లు సమాచారం. అయితే నిజామాబాద్ నగర మేయర్ ప్రస్తుతం థ్రెట్ లో లేనందునే భద్రతను వెనక్కు తీసుకున్నట్లు పోలీసు అధికారులు, పోలీసు వర్గాలు తెలిపినట్లు మేయర్ పేర్కొన్నారని సమాచారం.


మేయర్ దండు నీతూ కిరణ్

నేడు అండర్ కబడ్డీ ఫైనల్ పోటీలు

నవతెలంగాణ-కామారెడ్డి

అండర్-17 బాలుర కబడ్డీ 67వ జాతీయ కబడ్డీ ఫైనల్ పోటీలు గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని ఇసుజియఫ్ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 4 రోజులుగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో 28 రాష్ట్రాల నుంచి హాజరైన అండర్ 17 కబడ్డీ క్రీడాకారులు 67వ జాతీయ కబడ్డీ పోటీలలో తలపడుతున్నారు. కార్యక్రమానికి పరిసర ప్రాంతాలలోని కబడ్డీ క్రీడాభిమానులు, పూర్వక్రీడాకారులు, ప్రస్తుత క్రీడాకారులు, యువకులు, పెద్దలు, అన్ని వర్గాల వారు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కామారెడ్డి ఆహ్వానిస్తున్నదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మ్యాచ్ అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతి వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా లోని ప్రజా ప్రతినిధులు హాజరై విజేతలు అందరికి బహుమతి ప్రదానం చేస్తారనీ ప్రకటనలో పేర్కొన్నారు.

గ్యారెంటీలు అమలుచేయకుంటే ప్రజాపోరాటాలు చేపడతాం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజా పోరాటాలు చేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు


పాల్గొన్న నాయకులు

పాలడుగు భాస్కర్ స్పష్టంచేశారు. సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశం జిల్లా కేంద్రంలోన పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 10 సంవత్సరాల పాటు బీఆర్ఎస్ పార్టీ అరాచక పాలన చేసి ప్రజలను ఇబ్బంది పెట్టిందన్నారు. 'ప్రజలు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెసు పార్టీ ని అధికారంలోకి తెచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు 6 గ్యారంటీ పథకాలుతో పాటు అనేక హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చింది. ఇచ్చిన హామీలను వారు చెప్పిన విధంగా 100 రోజుల్లో హమలు చేయాలని చేయకపోతే సీపీఐ(ఎం), ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని' తెలిపారు. 'మరోవైపు పార్లమెంటు ఎన్నికలు వస్తున్నాయని 10 సంవత్సరాలగా బిజెపి పార్టీ సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారు. ఇప్పటికీ 20 కోట్ల ఉద్యోగాలు తీసేసారు. ప్రతి ఒక్కరి అకౌంట్ లో 15 లక్షలు వేస్తామని హామీ ఇచ్చారు. అవి రాలేదు. బిజెపి



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ఇచ్చిన హామీలను అమలు చేయాలని' డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.రమ, జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, జిల్లా కోర్ కమిటీ సభ్యులు మోతిరాం నాయక్, సురేష్ గోండ, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నర్సింలు, ఎల్లయ్య, అరుణ్, యదగిరిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.


రైస్‌మిల్‌ను తనిఖీ చేసి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నెలాఖరులోగా ధాన్యం మిల్లింగ్ పూర్తవ్వాలి

- కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-పిట్లం

వరి ధాన్యంను రైస్ మిల్లులు నెలాఖరులోగా మిల్లింగ్ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం మండలంలోని మద్దెల్ చెరువు బిలాల్ రైస్ మిల్లును ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి లోపు ధాన్యం పూర్తి చేసి క్లియర్ చేసుకోవాలన్నారు. మార్చ్ నెలలో మళ్లీ ధాన్యం వచ్చే అవకాశాలు ఉన్నందున మిల్లు కంటిన్యూ రన్నింగ్ ఉండాలని, ప్రొడక్షన్ ఆగవద్దని సూచించారు. అనంతరం ప్రజా పాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డివిజనల్ రెవిన్యూ అధికారి భుజంగరావు, ఉపతహసీల్దార్ నరేష్, డిటీసీఎస్ ఖాలేద్, సురేష్ రైస్ మిల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

- దొంగలు రెచ్చిపోయే అవకాశం
- నగదు, బంగారం వెంట తీసుకెళ్లాలని పోలీసుల సూచన
- స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి : జిల్లా ఎస్పీ సింధు శర్మ



నవతెలంగాణ-కామారెడ్డి


సంక్రాంతి పండుగ పిల్లలకు సెలవులుండటంతో పాటు స్వగ్రామంలో పండగు నిర్వహించుకుందామని చాలా మంది తమ సొంతూర్లకు వెళ్తుంటారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటికి తాళం వేసి గ్రామాలకు ప్రయాణాలు చేస్తూంటారు. ఇదే అదనుగా భావించిన దొంగలు తాళం వేసి ఉంచిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంది. పండగల సమయాలలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణ కేంద్రాలలో దొంగతనాలు చోటుచేసుకున్న ఘటనలున్నాయి. ఈనేపథ్యంలో ఊర్లకు వెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. నగదు, బంగారం వీలైతే బ్యాంక్ లాకర్లలో భద్రపరచాలని, లేకుంటే వెంట తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. సమీప పోలీస్ స్టేషన్‌లో వివరాలు అందజేస్తే పోలీసులు నిఘా పెట్టే అవకాశం ఉంది.



సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సింధూశర్మ జిల్లా ప్రజలకు జాగ్రత్తలు, సూచనలు చేశారు. ఇంటికి తాళం వేయకుండా ఒక వ్యక్తి ఇంట్లో ఉండేలా చూడాలని, బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితిలో తాళం వేసిన ఇంట్లో ఉంచకూడదు. ఊరు వెళ్తున్నప్పుడు విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్ లను మీ చేతుల్లోనే ఉంచుకోవాలి. బస్ క్యాబిన్ లేదా సీట్లలో పెట్టి ధ్యాస మరలినట్లయితే దొంగతనం జరిగే అవకాశం ఉన్నది. గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి. బస్ ఎక్కే, దిగే సమయములో క్యూ పద్ధతి పాటిస్తూ అనుమానితులను గమనిస్తూ ఉండాలి. ఆరుబయట వాహనాలను వదిలి వెళ్ళకుండా ప్రహరీ లోపల ఉంచితే చోరీకి గురికాకుండా ఉండే అవకాశం ఉంది. అనుమానాస్పదంగా ఎవరయినా వీధుల్లో తిరిగితే వెంటనే 100 డయల్ కు గాని సంబంధిత పోలీస్ అధికారులకు గాని సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

సంక్రాంతి పండుగ అని కొద్ది ప్రాంతాలలో కోడి పందేలు ఆడతారు. కానీ కామారెడ్డి జిల్లాలో ఎలాంటి అనుమతులు లేవు. కోడి పందేలు, జూదం, ఇతర చట్ట వ్యతిరేఖ కార్యక్రమాలు, ఆటలు ఆడిన వారిపై కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకుంటాం. గాలిపటం ఎగుర వేయడానికి చైనా మాంజ, ఇతర ప్రాణ హాని కలిగించే మాంజలు వాడొద్దని, పిల్లల కదలికలపై తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు.

ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటీకరణ


వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీల పథకంలో నిర్వహించిన ప్రజా పాలనలో మండలం నుండి లబ్దిదారులు చేసుకున్న దరఖాస్తులను పెద్ద కొడపగల్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కంప్యూటీకరణ చేపట్టారు. మండలం వ్యాప్తంగా మొత్తం 7480 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ రాణి తెలిపారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం తాగునీటి సరఫరా తీరుతెన్నులపై కలెక్టర్ ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో సమీక్షించారు. రానున్న వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన జరపాలని సూచించారు. జిల్లాలోని ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి ఎద్దడి తెరపైకి రాకుండా ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితిని పరిశీలించి వారం రోజుల్లోపు సమగ్ర నివేదికలు సమర్పించాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన సభల సందర్భంగా పలు చోట్ల మిషన్ భగీరథ జలాలు ఇంటింటికీ సరఫరా కావడం లేదని ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తెచ్చారని అన్నారు. ఈ తరహా ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రతి ఆవాసంలో ఒక్కో నివాస గృహం వారీగా శుద్ధి జలాలు అందేలా నీటి సరఫరా వ్యవస్థను చక్కదిద్దాలని అన్నారు. ముఖ్యంగా అంతర్గత సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎక్కడైనా లోపాలను గుర్తిస్తే వెంటనే వాటిని సరిచేయాలన్నారు. వేసవికాలం ఆరంభానికి ముందే నీటి సరఫరా వ్యవస్థను గ్రామాల వారీగా, ఒక్కో నివాస గృహం వారీగా చక్కదిద్దాలని హితవు పలికారు. గ్రామ సర్పంచ్ లు, కార్యదర్శులను సంప్రదించి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. నివాస ప్రాంతాలతో పాటు అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు సమృద్ధిగా శుద్ధి జలాలు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ఎక్కడైనా సమస్యలు నెలకొని ఉంటే తమ దృష్టికి తేవాలని, ఎక్కడ కూడా నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్.ఈ రాజేంద్ర కుమార్, ఈ.ఈలు రాకేష్, నరేష్, డీ.ఈలు, ఏ.ఈలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులే ఉండాలి

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రభుత్వ పరంగా నిర్వహించే కార్యక్రమాలలో వేదికపై ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రమే ఉండాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు వేదిక పైకి వచ్చి ఫోటోలు దిగేందుకు ప్రయత్నించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే వేదికపై పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉండవద్దని ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు, అధికారులు మాత్రమే ఉండాలని తెలిపారు . మండలం లోని పలు గ్రామాలకు చెందిన 43 లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఏదైనా పథకాలు పేదలకు అందించే బాధ్యత తనపై ఎంతైనా ఉందని, ఏ ప్రభుత్వం ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టిన పేదలకు అందే విధంగా తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎవరికీ ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తమ వద్దకు వచ్చి చెప్పుకోవచ్చన్నారు. అనంతరం ఆయనను పలువురు శాలువాలతో సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్ రెడ్డి, కామారెడ్డి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆర్డిఓ శ్రీనివాస్, తహసిల్దార్ శివప్రసాద్, పట్టణ ఎంపీటీసీ సభ్యురాలు బండి చంద్రకళ రాములు, పలువురు అధికారులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పులున్నా.. హామీలు అమలుచేస్తాం

- గత పాలకులు అభివృద్ధిని భ్రష్టుపట్టించారు
- ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు

నవతెలంగాణ-మద్నూర్/పెద్దకొడప్‌గల్

గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారాన్ని చలాయించి రాష్ట్ర అభివృద్ధిని బ్రష్టు పట్టించిందని ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు విమర్శించారు. అప్పులున్నా. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామని స్పష్టంచేశారు. 52 మంది లబ్దిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ ఎమ్‌డీ ముజీబ్ ఆధ్వర్యంలో అందజేశారు. గత ప్రభుత్వం లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్ర అభివృద్ధిని బ్రష్ట పట్టిస్తూ రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా అదోగతి చేసిందని


మద్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మికాంత్‌రావు

విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటగానే ఆరు గ్యారెంటీలు అమలు ఎక్కడ అంటూ బి ఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలకు మభ్యపెట్టడానికి కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారని, ఆ పార్టీ నాయకుల మాటలను ప్రజలు నమ్మరని ఆరు నూరైనా నూరు ఆరైనా ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వంద రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ లతో పాటు రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ పటేల్, వైస్ ఎంపీపీ జైపాల్ రెడ్డి, ఎంపీటీసీ సంగీత కుశాల్, స్థానిక సర్పంచ్ సురేష్, ఆత్మ కమిటీ చైర్మన్ కొండ గంగాధర్, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


పెద్దకొడప్‌గల్‌లో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

పెద్దకొడప్ గల్ : పెద్ద కొడపగల్ మండల కేంద్రంలో బుధ వారం జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ తహసీల్దార్ కార్యాల యంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో లబ్ధిదారులకు ప్రతి ఒక్క లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో అందరికి సమాన అవకాశాలు ఉంటాయని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో నాయకులు చేసిన అవినీతి పూర్తిగా కక్కిస్తామని దీంతో ఆరు గ్యారంటీలే కాదు 12 గ్యారెంటీలను ప్రజలకు అందజేయవచ్చని తెలి పారు. మండలంలోని ప్రజా పాలనలో 7480 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు తహశీల్దార్, ఎంపిడిఓ కార్యాల యం అధికారులు , నాయకులు శాలువా పులమా లతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో రాణి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, శామప్ప, నాగిరెడ్డి, చిప్ప మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌తోనే ఉద్యోగులకు న్యాయం

- వేతన సవరణ చేపట్టాలి : ఎల్ఐసీ ఉద్యోగ జేఏసీ మెరుపు సమ్మె



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న జేఏసీ ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పాత పెన్షన్ విధానాల వల్ల ఉద్యోగులందరికీ న్యాయం జరుగుతుందని, కావున ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ఎల్ఐసీ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం బుధవారం మెరుపు సమ్మె చేపట్టారు. కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి నినాదాలు చేశారు.

వివరాలు మెయిన్‌లో..

విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలు

- విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం

నవతెలంగాణ-రామారెడ్డి

విద్యుత్ సమస్యను పరిష్కరించడంలో విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో, విద్యుత్ షాక్ తో రైతు గాయపడిన ఘటన బుధవారం మద్దికుంటలో చోటు చేసుకుంది. స్థానిక వివరాల ప్రకారం.. గుండెబోయిన రమేష్ పంట పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పీస్ వైరు పోవటంతో సిబ్బందికి తెలియజేశాడు. సమయం పడుతుందని చెప్పడంతో, గ్రామానికి చెందిన మైసి రాజు విద్యుత్ సరపర ఆపు చేయడానికి, హ్యాండిల్ కొట్టడానికి ప్రయత్నించగా విద్యుత్ షాక్ రావడంతో గాయాలు అయ్యాయి. దీంతో ఆస్పత్రికి తరలించారు. గ్రామ పరిసరాల్లో పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు ఉంటే సమాచారం అందించినా విద్యుత్ సిబ్బంది స్పందించడం లేదని, ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి, డబ్బులు పెట్టి మరమ్మతు చేయించుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇకముందు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా రైతులకు విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

సర్పంచుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా


ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసిన సర్పంచ్‌లు

నవతెలంగాణ-భిక్కనూర్

సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారు. బుధవారం మండలానికి చెందిన సర్పంచులు హైదరాబాదులో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాములును కలిసి పలు సమస్యలను వివరించారు. అనంతరం ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ గత ప్రభుత్వం సర్పంచ్ల సమస్యలను పట్టించుకోలేదని సీఎం రేవంత్ రెడ్డికి వివరించి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు సర్పంచ్‌లు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు నరసింహులు యాదవ్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మధుమోహన్ రెడ్డి, సర్పంచ్ లు గుడిసె రాములు, తునికి వేణు, తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
గురువారం జనవరి 11, 2024 www.navatelangana.com

బాధితుడికి సెల్ ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన దుగ్గెం రాజ్ కుమార్ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఐ గోవర్ధన్‌రెడ్డి బుధవారం అందజేసినట్లు బాల్కొండ ఎస్సై కే. గోపి తెలిపారు. గత ఆరు నెల క్రితం రాజ్‌కుమార్ తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సిఈఐఆర్ సిస్టం ద్వారా సెల్ ఫోన్ ను గుర్తించి బాధితునికి అందజేశారు.


బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న సీఐ గోవర్ధన్‌రెడ్డి

పిఆర్టియూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో పీఆర్‌టీయూ 2024 క్యాలెండంను

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర గౌడ్, మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్, ఆర్మూర్ డివిజన్ ఇంచార్జి టి.లక్ష్మణ్ పటేల్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేసి ఎన్నో సమస్యల్ని సాధించిన ఘన చరిత్ర పీఆర్‌టయూఈ సంఘానిదని, త్వరలో కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వానికి విన్నవించి ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరింపచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బాల్కొండ మండల అధ్యక్షులు వేల్పూర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గడ్డం నర్సారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ప్రశాంత్ కుమార్, డి. మనోహర్ రావ్, టి. రామస్వామి, ఎం. నర్సారెడ్డి, ఏ. రాంకిషన్, భోజన్న, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు టి.లక్ష్మణ్, మండల అసోసియేట్ అధ్యక్షులు కే . రవికుమార్, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం ముగింపు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రంలోని శ్రీ శివసాయి మందిర ఏకాదశ

(11వ వార్షికోత్సవం) బుధవారంతో ముగిసిందని సాయి సేవా సమితి సభ్యులు నునుగొండ అంజయ్య, దయానంద్ తెలిపారు. ఈ నెల 4న ప్రారంభమైన 'సాయి పారాయణం' ఘనంగా భక్తుల మధ్య అంగరంగ వైభవంగా చేపట్టామని, అందుకు సహకరించిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు, గ్రామ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వార్షికోత్సవం విజయవంతం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాయి సేవా సమితి సభ్యులు నార్ల రాజు, కొమ్ముల సాయిరెడ్డి, పృథ్వీవల్లబ్, ఆలయ అర్చకులు సోంనాథ్ చార్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు..

కబడ్డీ పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినట్టు పిడి ముత్తన్న బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆదర్శ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయిశ్రీ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడంపై పిన్సిపల్ శంకర్ ఉపాధ్యాయుల బృందం హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఆలయాలకు పెరుగుతున్న తాకిడి

- పెరిగిన మహిళల ఉచిత ప్రయాణాలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మహాలక్ష్మి పథకం మహిళలకు వరంగా మారింది. ఆర్టీసీ బస్సుల్లో అతివల ప్రయాణాలు అనూహ్యంగా పెరిగాయి. ఏళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న తీర్థ యాత్రలను పూర్తి చేస్తున్నారు. వివిధ ఆలయాల్లో తీర్చాల్సిన మొక్కులకు మోక్షం కల్పిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ఆలయాలకు మహిళా భక్తులు పోటెత్తుతున్నారు. దైవదర్శనానికి వెళ్లేందుకు టికెట్ భారంతో వెనుకడుగు వేసే వారు ప్రస్తుతం ఉచిత ప్రయాణాన్ని అందిపుచ్చుకొని ఆలయాలను చుట్టొస్తున్నారు. తెలంగాణలోని ఏ ప్రాంతంలో ఉన్న ఆలయానికైనా ఉదయం వెళ్లి రాత్రికి వచ్చే అవకాశం ఉండడంతో యాత్రల జోరు పెరిగింది

యాదగిరిగుట్టకు అధికంగా

యాదగిరిగుట్టకు మహిళలు భారీ సంఖ్యలో వెళ్లొస్తున్నారు. గతంలో రోజుకు 21 వేల మంది మహిళలు వెళ్తే.. ప్రస్తుతం 33 వేల మంది వెళ్తున్నట్లు ఆర్టీసీ లెక్కలు చెబుతున్నాయి. ఇలా ఒక్క రోజులో వివిధ దేవాలయాలకు గతంలో 86263 మంది మహిళా భక్తులు వెళ్తే.. మహాలక్ష్మి పథకం తర్వాత వారి సంఖ్య 1,57,089కు పెరిగింది.

శబరిమల యాత్రకు అయ్యప్ప స్వాములు



నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో మారుతి జోషి మహారాజ్ ఆశీస్సులతో బుధవారం అయ్యప్ప మాలదారులు శబరిమల యాత్రకు అయ్యప్ప ఆలయం నుండి బస్సులో బయలుదేరారు. వారికి ఆలయ ప్రధాన పూజారి గణేష్ జోషి ప్రత్యేక పూజలు చేసి యాత్రను ప్రారంభించారు. కుందారం శ్రీనివాస్ గురుస్వామి, కోటగిరి రాజు గురుస్వామి, శ్రీకర్ గురుస్వామి, గంగాధర్ గురుస్వామి ఆధ్వర్యంలో 36 మంది అయ్యప్ప స్వాములు శబరి యాత్రకు బయలుదేరి వెళ్లారు. యాత్రను ప్రారంభించిన వారిలో గురుస్వాములు బలరాం సింగ్, ధర్మపురి, అంబటి నవీన్, నరేందర్, రమేష్ తదితరులు ఉన్నారు.

భద్రత ప్రమాణాలు గాలికి వదిలేసిన నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి


వినతి పత్రం అందజేస్తున్న టీజీవిపి నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

భద్రత ప్రమాణాలు గాలికి వదిలేసిన నారాయణ పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని టిజీవిపి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్, నాగర అధ్యక్షులు అఖిల్ అధ్వర్యంలో నిజామాబాద్ డివిజన్ ఫైర్ స్టేషన్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్ మాట్లాడుతూ నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో గల నారాయణ కార్పొరేట్ విద్యార్థుల భద్రత గాలికి వొదిలేసి ఫైర్ సేఫ్టీ నిబంధనలు తుంగలో తొక్కిందని అన్నారు. పాఠశాలకు ఫైర్ భద్రత ఏర్పాటు చేయించుకోవాలని విజ్ఞప్తి చేసిన పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారని అన్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారిని వివరణ కోరగా పాఠశాల యాజమాన్యం ఫైర్ సేఫ్టీ కోసం దరఖాస్తు చేసుకుందని చెప్పారాన్నరు. సెలవిస్తున్నారు. ఇదే విషయమై ఫైర్ స్టేషన్ అధికారులను వివరణ కోరగా అటువంటి దరఖాస్తులు ఏమి పెండింగ్లో లేవని చెప్పారని తెలిపారు. భద్రత ప్రమాణాలు పాటించకున్నా కార్పొరేట్ పాఠశాలలు రాజకీయ ఆర్థిక పలుకుబడిని ఉపయోగించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ విద్యాశాఖ నుండి తప్పుదోవలో అనుమతులు తెచ్చుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కార్యకర్తలు అనిరుధ్ రాజు, షోహెల్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో స్థిరపడేలా స్వయం ఉపాధికి శిక్షణ

- డిఆర్డిఏ పీడీ చందర్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వాళ్ళు జీవితంలో స్థిరపడేలా స్వయం ఉపాధి కల్పిస్తున్నారని, ఈ శిక్షణల గురించి ఇతరులకు తెలపాలని డీఆర్డీఓ, డిఆర్డీఏ పిడి చందర్ నాయక్ అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ అధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత శిక్షణా కార్యక్రమనికి ముఖ్య అతిథిగా పిడి చందర్ నాయక్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత శిక్షణలో ప్రభుత్వం అందిస్తున్న ఇన్సూరెన్స్, ఇతర ఆర్థిక లావాదేవీలు, ఆర్థిక క్రమశిక్షణ మీద ఆరు రోజులపాటు ఉంటుందని తెలిపారు. ఇందులో నేర్చుకునే ప్రతి ఒక్క సమాచారం మీ గ్రామంలో ఉండే మహిళ సభ్యులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ , సేర్ప్ అధికారి వెంకటేష్,డిపిఎం కామారెడ్డి రవీందర్,అల్ ఇండియా అఫిషియల్ వరలక్ష్మి, సిబ్బంది రామకృష్ణ, నవీన్, అర్చన, నర్మద, ఫరిధ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ రద్దును పునరాలోచించాలి

- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట లబ్దిదారుల ధర్నాలు
- గృహజ్యోతిలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వినతి
- లబ్దిదారులకు అదనంగా మూడు లక్షలు అందించాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన గృహలక్ష్మి లబ్దిదారులు బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ కాపీలను కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని కోరుతూ తహసిల్దార్ ఆంజనేయులకు వినతి పత్రం అందజేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి పథకంలో ఆర్థిక సహాయం కింద రూ.3లక్షల ప్రొసీడింగ్ మంజూరి ఇచ్చినట్లు లబ్ధిదారులు పేర్కొన్నారు. వీటిని కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచించి గృహలక్ష్మి పథకం రద్దును విరమించుకోవాలని కోరారు. లేకుంటే పేద వారికి ముందుగా గుర్తించి ఇంటి నిర్మాణం కోసం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నర్సాపూర్ సర్పంచ్ పెండ ప్రభాకర్, దొమ్మరి చౌడు తండా సర్పంచ్ భాస్కర్, గ్రామ గృహలక్ష్మి లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

భీంగల్: గృహలక్ష్మి పథకంలో లబ్దిదారులను గుర్తించి ప్రొసీడింగ్ కాపీలను అందజేసిందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం సరి కాదని బిఆర్ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దొనకంటి నర్సయ్య మల్లెల లక్ష్మణ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని సుమంగళి చౌరస్తా వద్ద గృహ లక్ష్మీ లబ్దిదారులతో కలిసి ధర్నా నిర్వహించి అనంతరం తహసిల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఖాళీ జాగా ఉండి ఇండ్లు లేని వారికి ఇండ్లు కట్టించాలని సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని, ఇందులో భాగంగానే అర్హులను గుర్తించి ప్రొసీడింగ్ కాపీలను కూడా అందజేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం రాజకీయ దురుద్దేశమని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు మరో మూడు లక్షలను అదనంగా కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గృహజ్యోతిలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

ముప్కాల్: గృహజ్యోతి పథకంలో తమకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు 'గృహలక్ష్మి' లబ్ధిదారులతో కలిసి తహసిల్దార్ వనజ రాణికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేసిన 'గృహలక్ష్మి' పథకాన్ని, అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ పార్టీ రద్దు చేయడాన్ని నిరసిస్తూ 'గృహలక్ష్మి' ద్వారా ప్రొసిడింగ్ కాపీలు అందుకున్న లబ్ధిదారులు నష్టపోవడం జరుగుతుందని ఎంపీపీ సామ పద్మ, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సావ్వ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే 'గృహజ్యోతి' పథకం ద్వారా మొదటి ప్రాధాన్యతను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా మంజూరైన లబ్ధిదారులకు ఇవ్వాలని తహసిల్దార్‌ను కోరారు. లేకుంటే బీఆర్ఎస్ పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సావ్వ, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉమాశంకర్, ముప్కాల్, రెంజర్ల, కొత్తపల్లి,సర్పంచులు కొమ్ముల శ్రీనివాస్, ఆకుల రాజేశ్వర్, మారెల్లి విష్ణు, రెంజర్ల సొసైటీ చైర్మన్ కోమటిశెట్టి గంగాధర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గృహ లక్ష్మీ పథకాన్ని కొనసాగించాలి

మోర్తాడ్: రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన గృహ లక్ష్మీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయకుండా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులతో తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులకు మూడు లక్షల రూపాయల రుణాన్ని అందించే పథకాన్ని ప్రారంభించిన వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసే విధంగా చర్యలు చేపడుతుందని అలా కాకుండా ఆ పథకాన్ని కొనసాగించి అర్హులందరికీ మూడు లక్షల రూపాయలు అందించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులతో పాటు నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. గత ప్రభుత్వం తమకు ప్రొసీడింగ్ కూడా ఇచ్చిందని, మూడు లక్షల రూపాయలు వస్తే ఇండ్లు నిర్మించుకోవచ్చని తెలిపారు.


కమ్మర్‌పల్లిలో..తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత


భీంగల్‌లో...


ముప్కాల్‌లో...


మోర్తాడ్‌లో...

వడ్డెర ఓబన్న జయంతిని నిర్వహించడం అభినందనీయం

- సర్క్యులర్ జారీ చేసినందుకు ధన్యవాదాలు
- వడ్డెర వృత్తిదారుల సంఘం

నవతెలంగాణ-కంఠేశ్వర్

వడ్డెర ఓబన్న 217వ జయంతిని ప్రభుత్వం నిర్వహించాలని సర్క్యులర్ జారీ చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు వడ్డెర నిజామాబాద్ నాందేవాడ వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం వృత్తిదారుల భవన్‌లో నాందేవ్‌వాడలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు మాట్లాడుతూ.. రేపు జరిగే వడ్డె ఓబన్న జయంతి ఉత్సవాల్లో వడ్డెరులు అందరూ పాల్గొనాలని కోరారు. జయంతి ఉత్సవాలు నాందేవ్‌వాడ కార్యాలయంలో ఉంటాయన్నారు. వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు అందరూ 10 గంటల వరకు చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా సలహాదారుడు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు బండారి ఎల్లయ్య, డెన్న గోగుల చిన్న సాయిలు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం సభ్యులు

పరిహారం అందించండి

- ఆర్డీవో కార్యాలయానికి తరలివచ్చిన బాధితులు


మాట్లాడుతున్న రైతులు

నవతెలంగాణ-బోధన్

బైపాస్ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు పరిహారం అందించాలని కోరుతూ రెంజల్ మండలం నీల గ్రామానికి చెందిన నిరుపేద రైతులు బుధవారం బోధన్ ఆర్డీవో కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు, నిరుపేద, దళిత కుటుంబాలకు చెందిన తమ భూములు ప్రభుత్వం నిర్మిస్తున్న బైపాస్ రహదారి నిర్మాణంలో కోల్పోతున్నామని, తమను ప్రభుత్వం ఆదుకొని తగిన పరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 20 ఎకరాల వరకు తమకు ఉన్న భూములను కోల్పోతున్నామని వారు వాపోయారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఎస్ఎస్ఎఫ్ భూములు తమకు ఆధారంగా ఉండేవని ప్రస్తుతం బైపాస్ రహదారి నిర్మాణంలో అవి కోల్పోతుండడంతో తమకు ఎలాంటి ఆధారం లేకుండా పోయిందని వాపోయారు. తనకు భూమి ఉన్న పట్టా పాస్ బుక్ లేదని, ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని నర్సవ్వ అనే వద్ధురాలు తన బాధను వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి భూములు కోల్పోతున్న వారికి పరిహారం అందించాలని వారు కోరారు. ఆర్డీఓ కార్యాలయానికి తరలివచ్చిన వారిలో గంగామణి, మోచి భాగన్న, లక్ష్మి , అబ్బన్న, గంగమణి, ఎంకవ్వ, నర్సవ్వ, గంగారాం తదితరులు ఉన్నారు.

వస్తువుల ప్యాకెట్లపై వీటి ముద్రణ తప్పనిసరి

- డిసిఐసి చైర్మన్ రాజేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అన్ని రకాల వస్తువుల ప్యాకెట్ల పైన జనవరి ఒకటవ తేదీ 2024 నుంచి తప్పని సరిగా మాన్యుఫ్యాక్చరింగ్ డేట్, యూనిట్ సేల్ ప్రైస్ ధరను ముద్రించాలని వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్‌సింగ్ ఆదేశించారని నిజామాబాద్ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మాయావర్ రాజేశ్వర్ బుధవారం తెలిపారు. ఇప్పటివరకు ప్యాకేజ్డ్ కమాడిటీస్‌పై మాన్యుఫ్యాక్చరింగ్ తేదీ లేదా దిగుమతి చేసుకున్న తేదీ లేదా ప్యాకేజింగ్ తేదీల్లో ఏదో ఒకటి ముద్రిస్తే సరిపోదని రాజేశ్వర్ తెలిపారు. తాజా నోటిఫికేషన్ ప్రకారం.. వస్తువు తయారు చేసిన తేదీని తప్పనిసరిగా ముద్రించాలని రాజేశ్వర్ తెలిపారు. దాంతోపాటు యూనిట్ సెల్ ప్రైస్ కూడా ముద్రించడం తప్పనిసరి చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్యాకేజ్ ఐటమ్స్‌ను వేరువేరు పరిమాణంలో అమ్ముతారు కాబట్టి యూనిట్ సేల్ ప్రైస్‌ను వినియోగ దారులు తెలుసుకోవడం ముఖ్యమని రాజేశ్వర్ తెలిపారు. కేజీ కన్నా తక్కువ పరిమాణం గల ప్యాకెట్ పై ఒక గ్రా ము అమ్మకం ధరను ఆ ప్యాకెట్ గరిష్ట చిల్లరధరను ముద్రించాలని రాజేశ్వర్ కోరారు.

యువత క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలి

- తహశీల్దార్ మల్లయ్య

నవతెలంగాణ-బోధన్

యువకులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని సాలూర తహశీల్దార్ మల్లయ్య అన్నారు. బుధవారం సాలూర మండల కేంద్రంలో సొసైటి చైర్మన్ అల్లె జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ సీజన్-3ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. నేటి యువకులు అన్ని రంగాలలో ప్రతిభ కలిగి ఉండాలని సూచించారు. క్రీడలతో యువకులు శారీరక ధృఢత్వం కలిగి ఉంటారని, కావున ప్రతి ఒకరు క్రీడల్లో నైపుణ్యం సాధించాలన్నారు. దేశంలో క్రికెట్‌కు మంచి ఆదరణ ఉందని భవిష్యత్తులో జాతీయస్థాయి క్రీడాకారులుగా సాలూర నుండి ఎదగాలని కోరారు.అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు.

ఉత్తమ క్రికెటర్లను తయారు చేయడమే నా లక్ష్యం...

సాలూర మండలంలోని యువతను ఉత్తమ క్రికెటర్లుగా తయారు చేయడమే తన ధ్యేయమని సాలూర సొసైటీ చైర్మెన్, టోర్నీ నిర్వాహకులు అల్లె జనార్ధన్ అన్నారు. జాతీయ స్థాయి క్రికెటర్లయిన ధోని, సచిన్ లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ సవిత, డాక్టర్ శైలేందర్, మండల ఆర్ఐ గంగాధర్, సొసైటీ సీఈవో బస్వంత్ రావు,బుయన్ సురేష్, అల్లె రమేష్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనార్ధన్


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జనార్ధన్

భయంతోనే బీఆర్ఎస్ ధర్నాలు



- డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీఆర్ఎస్ పార్టీ డొల్లతనం బయటపడుతుందనే భయంతో లబ్దిదారుల పేరుతో కార్యకర్తలతో కలిసి ధర్నా చేస్తున్నారని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో 10 సంవత్సరాలుగా ప్రజలను, పేదలను బీఆర్ఎస్ పార్టీ వంచించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తామన్న హామీలో భాగంగా ప్రజా పాలనలో దరఖాస్తులు తీసుకున్నారని తెలిపారు. నోటిఫికేషన్‌కు వారం రోజుల ముందు ఇచ్చిన అప్లికేషన్లను రద్దు చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ధర్నాపిలుపు అనేది వారి మూర్ఖత్వానికి నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు కేవలం 3 లక్షల రూపాయలు మాత్రమే ఇచ్చిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హుడైన వ్యక్తి ఏ పార్టీ వాడైనా ఆలోచించకుండా ఇల్లు నిర్మాణానికి ఐదు లక్షలు ఇస్తుందని అన్నారు. కానీ గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గాని, పింఛన్లు గాని, ట్రాక్టర్ సబ్సిడీలు గాని, కళ్యాణ లక్ష్మి గాని కేవలం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు వారి కుటుంబ సభ్యులకు వారు అనర్హులు అయినప్పటికీ ఇచ్చిందని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అలాంటి అనర్హులను తీసివేసి అర్హులకు మాత్రమే పథకాలు అమలు చేస్తుంది. పేద ప్రజలు ఎవరు కూడా ఇల్లు లేకుండా ఉండకూడదు అనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తుందని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నుండి ఓడిపోయిన ఎమ్మెల్యేలు, ముఖ్యంగా ప్రశాంత్ రెడ్డి ఒక్కసారి ఆలోచన చేయాలని అన్నారు. మీ 10 సంవత్సరాల పాలనలో మీరే గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉండి ఈ జిల్లాలో పేదలకు ఇండ్ల నిర్మాణంలో మీరు వహించిన అలసత్వం చేతకానితనం వల్లనే ఈ రోజు ప్రజాపాలనలో ఇండ్లు లేవని, ఇన్ని దరఖాస్తులు వచ్చాయంటే అది మీ అసమర్ధ పాలనకు నిదర్శనం కాదా అని కాంగ్రెస్ పార్టీ తరపున ప్రశాంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నాం. మీయొక్క డొల్లతనం ఎక్కడ బయట పడుతుందోనని ధర్నాలకు పిలుపు ఇవ్వడం అనేది కేటీఆర్ తలదురుసుతనానికి, తెలివి తక్కువ తనానికి నిదర్శనంగా కాంగ్రెస్ పార్టీ భావిస్తుందని అన్నారు. ప్రజలు కానీ, లబ్ధిదారులు కానీ ఎవ్వరు కూడా ఆందోళన పడవద్దని, కాంగ్రెస్ పార్టీ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి ప్రజలు తమకు వచ్చే అవకాశాలను చేజార్చుకోవద్దు అని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

రోటరీ క్లబ్, ప్రణతి డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో

- పిప్రిలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్, ప్రణతి డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలం లోని పిప్రి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని బుధవారం విద్యార్థులకు ప్రణతి డెంటల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో డాక్టర్ హనుమంత్ రెడ్డి దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థికి దంత సమస్యలను పరిశీలించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ మన ఆరోగ్య జీవన విధానంలో దంత సంరక్షణ చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరు డాక్టర్ సూచించిన విషయాలను తప్పకుండా పాటించాలని తెలిపారు. డాక్టర్ హనుమంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి పట్వారి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ మాజీ అధ్యక్షులు పుష్కర్ రావు, దాము,శశి, శివ ప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితేనే టాపర్

● ఎంఈఓ వెంకటేశం



మాట్లాడుతున్న ఎంఈవో వెంకటేశం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

పట్టుదలతో చదివితే పదవ తరగతిలో మండల్ టాపర్‌గా నిలవచ్చునని ఎంఈఓ వెంకటేశం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల జెడ్ పి హెచ్ ఎస్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు ఎం ఈ ఓ పలు సూచనలు చేశారు. పదవ తరగతి పరీక్షల పట్ల భయపడకుండా ప్రత్యేక శ్రద్ధతో చదవాలన్నారు. అధికమార్కులు సాధించే పలు సలహాలు సూచనలు ఆయన విద్యార్థులకు బోధించారు. పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు వారి వారి ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు విద్యార్థులకు ఎలాంటి పని చెప్పకుండా చదువుపై దృష్టి పెట్టేలా చూడాలన్నారు. ఏకాగ్రతతో చదివితే మండల టాపర్ గా మార్కులు సాధించవచ్చని తెలిపారు.

రోడ్డు పనులు పరిశీలన



నవతెలంగాణ-మద్నూర్

సంగారెడ్డి, నాందేడ్ అకోలా హైవే రోడ్డు మేనూరు గ్రామంలో అలాగే మద్నూర్ బైపాస్ రోడ్డు నుంచి మండల్ కేంద్రం మీదుగా మిర్జాపూర్ హైవే రోడ్డు వరకు గడిచిన 10 ఏళ్ల కాలంగా అధ్వానంగా మారిన రోడ్డు అభివృద్ధి పనులు చకచక జరుగుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం జుక్కల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తోటా లక్ష్మి కాంతారావు గెలవడం ఈ రెండు గ్రామాల మధ్య గల అధ్వాన్నంగా మారిన రోడ్డు అభివృద్ధి పనులు వెంటనే చేపట్టారు.

బీటి రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్న వాటిని ఎమ్మెల్యే మేనూరు సమీపంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి పట్ల పట్టించుకోకపోవడం ప్రజలకు రహదారి సరిగ్గా లేక ఇబ్బందులు ఎదుర్కునే వాటిని దృష్టిలో పెట్టుకొని రోడ్డు అభివృద్ధి పనులు వెంటనే చేపట్టడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ మెయిన్, గ్రామ సర్పంచ్ విట్టల్ గురూజీ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏడాదిక్రితం డబ్బులు ఇంకా రాలే

● అధికారులను నిలదీసిన ఉపాధి కూలీలు



జాబ్ కార్డులు అందజేత

నవతెలంగాణ-పిట్లం

గతేడాది నిర్వహించిన ఉపాధి హామీలో పనులు చేసినప్పటికీ తమకు డబ్బులు రాలేదని ఉపాధి హామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ విజయ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధి హామీ సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు నిర్వహించినప్పటికీ అధిక మొత్తం కూలీలకు డబ్బులు రాలేదని నిలదీశారు. కొంతమందికి జాబ్ కార్డు లేనందున ఉపాధి హామీ పనులను వినియోగించుకోలేక ఉన్నామని అసంతృప్తి వ్యక్తపరిచారు. దీంతో స్పందించిన అధికారులు ఈకేవైసీ సమస్యల మూలంగా కొంతమంది కూలీలకు తమ అకౌంట్లో డబ్బులు రాలేదని వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇబ్రహీం జునొది, వార్డ్ మెంబర్ లు గులని ఎల్లయ్య, గాండ్ల సత్యం మండల, గ్రామ స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పోచారం ప్రాజెక్టులో..

నీటి మోటార్లు తొలగించాలి

● మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల డిమాండ్

● మోటార్లు ఉన్నా ఎందుకు స్పందించట్లేదని ఇరిగేషన్ ఏఈపై సభ్యుల ప్రశ్నల వర్షం



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

పోచారం ప్రాజెక్టులో అక్రమంగా ఇతర జిల్లాల వారు వందల సంఖ్యలో మోటర్లు పెట్టి నీటిని తోడేస్తున్నారని సర్పంచ్‌లు ఆరోపించారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోచారం ప్రాజెక్టులో ఉన్న నీరు ప్రస్తుతం జోన్ బీ రైతుల కోసం నీటిని విడుదల చేస్తున్నారని కానీ ఇతర జిల్లాల ప్రాజెక్టు చుట్టూ ఉన్న గ్రామాలు అక్రమంగా మోటర్లను పెట్టి నీళ్లను తోడేస్తున్నారని వాపోయారు. నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాజుదాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు సభలో పలు అంశాలపై చర్చించారు.

ఎల్లారెడ్డి మండలాలకు సంబంధించిన పోచారం ప్రాజెక్టు నీళ్లను ఇతర ప్రాంతాల వాళ్ల తోడేస్తే రెండు మండలాల వాళ్ల ఇబ్బందులకు గురవుతారన్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన కనెక్షన్లు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ సందర్భంగా ఏవో విజయ శేఖర్ మాట్లాడుతూ.. నాగిరెడ్డిపేట మండలంలో 64 శాతం మంది రైతులకు రైతుబంధు డబ్బులు రూ.2కోట్ల 20 లక్షలు వారి ఖాతాల్లో జమ అయినట్టు తెలిపారు. యాసంగికి సంబంధించి మండల వ్యాప్తంగా 4459 ఎకరాలలో పంటసాగు చేస్తున్నట్లు అయిన తెలిపారు. ఈ వారంలో మిగతా రైతులకు కూడా డబ్బులు జమగానున్నట్లు ఆయన తెలిపారు.

తహసీల్దార్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఐదు గ్రామాల్లో రేషన్ దుకాణాల ఖాళీలు ఉన్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 19 కళ్యాణలక్ష్మి చెక్కులు రావడం జరిగిందని లబ్దిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశం మాట్లాడుతూ.. ఏప్రిల్ నెలలో పాఠశాల ఉద్యోగులకు రిలీవ్ చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఆత్మకూరు సబ్‌సెంటర్ ఎప్పుడూ మూసే ఉంటుంది.

సర్పంచ్ బాల్‌రెడ్డి.. ఆత్మకూరులో నూతనంగా ఏర్పాటు చేసిన హెల్త్ సబ్‌సెంటర్ ఎప్పుడు తెరవడం లేదని మండల సభలో ఆత్మకూరు సర్పంచ్ బాల్‌రెడ్డి ఆరోగ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు సెంటర్ మూసి ఉంటుందని వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. మండల సభలో పలు శాఖల అధికారులు వారి వారి ఎజెండాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జడ్పిటిసి మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్ పాటు ఆయా శాఖల అధికారులు సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో అడ్మిషన్‌లకు ఆహ్వానం

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కొరకు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల కళాశాలలో సీటు పొందిన వారికి ఐఐటి, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, వసతి, భోజనం ప్రభుత్వం అందజేస్తుందని సూచించారు.

తహసీల్దార్‌కు సన్మానం



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన లక్ష్మన్‌ను బుధవారం మండల సీనియర్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, మాల్ తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డిపేట్ మాజీ సర్పంచ్ బోయిన విట్టల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత



విద్యార్థులకు బుక్కులు, పెన్నులు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఉప్పల్ వాయి గ్రామ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆవాస ప్రాంత పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రి, పెన్నులు, టెస్ట్ బుక్కులు, పెన్సీలు బుధవారం అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన కుంట నవీన్, సిఆర్పి మహమ్మద్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో కుంట నవీన్, గణేష్, సి ఆర్ పి మహమ్మద్, వివి వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సదర్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని మునురుకాపు సదర్ సంఘం నూతన క్యాలెండర్‌ను బుధవారం పాలకవర్గ సభ్యులు ఆవిష్కరించారు. నూతనంగా ఎన్నుకున్న సదర్ సంఘ అధ్యక్షులు గాండ్ల నర్సింలును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సదర్ సంఘం పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మున్నూరు కాపు సంఘం సభ్యులు

దప్పిక తీర్చేందుకు బోరుబావులు

● జడ్పీటీసీ ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి



బోరుబావులను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామీణ గిరిజన ప్రాంతాలలో ప్రజల దప్పిక తీర్చేందుకు గ్రామాల వారిగా బోర్ బావుల తవ్వకాలు చేపడుతున్నట్లు లింగంపేట్ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి తెలిపారు. బుధవారం అయ్యపల్లి, భవానీపేట్, శెట్పల్లి, కంచుమహల్ గ్రామంలో జెడ్పీ నిధులతో ప్రజల దాహార్తి తీర్చడానికి జెడ్పీ నిధులతో బోరు తవ్వకాలు చేపడుతున్నట్టు తెలిపారు. వేసవికాలం సమీపిస్తుండటంతో వేసవి కాలంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తగా ప్రధానంగా తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను తండాలను గుర్తించి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు బోర్ మోటార్ తవ్వకాలను ప్రారంభించామన్నారు. మోటార్లు సైతం బిగించి ప్రజలకు దాహం తీరుస్తున్నామన్నారు. తాగునీటిని ప్రజలు వృథా చేయకుండా వాడుకోవాలని అన్నారు. ఎన్నికలు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మోతె సర్పంచ్ రాంరెడ్డి, సర్పంచ్లు శంకరప్ప, ప్రకాష్, గంగారెడ్డి, సత్యం, కాంగ్రెస్ నాయకులు నరేష్ గౌడ్, బాలయ్య, కాశ గౌడ్, పెద్దకాశిరాం, గంగారం, బాలరాజ్ గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మల్లన్న ఉత్సవాలు

● ఐదు రోజుల ఆదాయం రూ.79,120



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నవతెలంగాణ-కామారెడ్డి

దేవునిపల్లి గ్రామంలో ఐదు రోజుల పాటు మల్లన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హుండీ, స్వామి మాలధారణ, అగ్నిగుండాల, ఒడిబియ్యం, వేలంపాటల ద్వారా వచ్చిన ఆదాయం రూ.79,120 ఆదాయం వచ్చిందని గ్రామాభివృద్ధి కమిటీ కోశాధికారి గూడేల్లి రమణ తెలిపారు. చివరి రోజు చక్ర తీర్థం, నాగవల్లి నిర్వహించామని, అన్నదాన కార్యక్రమానికి 2500 వరకు భక్తులు వచ్చి అన్నప్రసాదం స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మార్కంటి స్వామి, ఉపాధ్యక్షులు బోజన్నగారి రాజు పాటిల్, ప్రధాన కార్యదర్శి ద్యావరి నవీన్, సభ్యులు వంగ రాహుల్, శివన్నగారి శ్రీకాంత చారి, మీసాల శంకర్, నాగల్ల స్వామి నిట్టూ ప్రభాకర్ రావు, ఎండ్రియాల బాలయ్య,కుర్ర శంకర్,ఆరేటి శ్రీను ప్రజా ప్రతినిధులు ,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

13లోపు ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలి

● తహసీల్దార్, ఎంపీడీవోకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు



ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తులను ఈ నెల13 నాటికి కంప్యూటర్లో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు.

తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాలను బుధవారం మధ్యాహ్నం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మద్నూర్ ఉమ్మడి మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటన్నింటినీ పూర్తి చేసి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ నమోదులో తప్పులు దొర్లకుండా సక్రమంగా కనిపెట్టాలని మండల తహసీల్దార్ ఎండి ముజీబ్, మండల అభివృద్ధి అధికారి రవీశ్వర్‌గౌడ్‌కు సూచించారు. కలెక్టర్ పరిశీలన కార్యక్రమంలో తహసీల్దార్ ఎండి ముజీబ్, ఆర్‌ఐ శంకర్, ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్, ఎంఈఓ రాములు, నాయక్ ఆయా శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల వితరణ



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో బుధవారం భోగేశ్వర ఆలయంలో అయోధ్య బాల రాముడు పాద స్పర్శత అక్షింతలకు పూజలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించిన అక్షింతలను గ్రామ ప్రజలు మహిళలు, యువకులు ఉదయం 8గంటలకు అక్షింతల వితరణ కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటికీ పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఓటీపీ చెప్పి మోసపోవద్దు

● ఎస్సై రాజశేఖర్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్సై రాజశేఖర్

నవతెలంగాణ-నిజాంసాగర్

ఆరు గ్యారెంటీల అమలు కోసం ఓటీపీ చెప్పాలంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసే అవకాశం ఉందని, కావున ఎట్టి పరిస్థితుల్లో ఎవరికీ ఓటీపీ చెప్పొద్దని ఎస్‌ఐ రాజశేఖర్ ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారెంటీల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారని, దాంట్లో ఫోన్ నెంబర్‌తో పాటు ఇతర వివరాలు అందించారని.. వీటిని సైబర్ నేరగాళ్లు పసిగట్టి ఫోన్ చేసే అవకాశం ఉందని తెలిపారు. రేషన్ కార్డు దరఖాస్తు చేస్తున్నామని, పెన్షన్ కోసం దరఖాస్తు ఓకే చేస్తున్నామని అంటూ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని ప్రజలను బురిడీ కొట్టించే అవకాశం ఉందని, కావున ఓటీపీ ఎవరికీ చెప్పొద్దని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే గ్రామ పంచాయతీలలోని గ్రామ కార్యదర్శులకు గాని అందులో పని చేస్తున్న సిబ్బందికి సమాచారం అడిగి తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు వేరే దగ్గర జరుగుతున్నాయని కావున జాగ్రత్తగా ఉండాలని, మోసపోవద్దని సూచించారు.

పార్టీలకతీతంగా పనిచేస్తా



చెక్కులు అందజేస్తున్న అధికారులు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా తాను పనిచేస్తున్నానని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దోమకొండ మండలంలోని ఆయా గ్రామాలలోని లబ్ధిదారులకు మంజూరైన 29 కళ్యాణ లక్ష్మి 1 షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్టు తెలిపారు. పార్టీలకతీతంగా నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన వద్దకు నేరుగా రావాలని సూచించారు. దోమకొండ మండలంలో మొత్తం 30 కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ సంజయ్ రావు, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచులు నల్లపు అంజలి శ్రీనివాస్, నాంపల్లి, నర్సవ్వ నర్సింలు. డిప్యూటీ తహసిల్దార్ రేఖ, ఆర్ ఐ మహేందర్ రెడ్డి, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కస్తూర్బా సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించినట్టు ప్రిన్సిపల్ వాసంతి తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. అదేవిధంగా బొమ్మల కొలువు గొబ్బిలు భోగి మంటలు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఆసక్తితో పాల్గొని పోటాపోటీగా ముగ్గులు వేసినట్టు తెలిపారు. అనంతరం సంక్రాంతి వేషధారణతో ఆటపాటలతో నృత్యాలు చేశారు.



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

అన్నం పెట్టే అన్నదాతలు మున్నూరు కాపు

● జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానించిన మున్నూరు కాపు సంఘం సభ్యులు

నవతెలంగాణ-మద్నూర్

అన్నం పెట్టే అన్నదాతలు మున్నూరు కాపులు అని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు అన్నారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మారుతిరావు సాంబశివ కన్నావార్ జయంతి వేడుకలు మద్నూర్ మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్నూరు కాపు అయిన మహారాష్ట్ర రెండో ముఖ్యమంత్రి జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. మున్నూరు కాపులు ఎందరో ధనవంతులు ఉన్నారని కొందరు మాత్రమే దాతలుగా పేరు ప్రతిష్టలు పొందుతున్నారన్నారు. మున్నూరు కాపుల్లో ఎందరో వెనుకబడి ఉన్నారని అలాంటి వారికోసం ప్రత్యేకంగా కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు సన్మానించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు మండల అధ్యక్షులు సారంగులవారు గంగారం, గ్రామ అధ్యక్షులు డాక్టర్ బండి వార్ విజయ్, ప్రధాన కార్యదర్శి సందుర్‌వార్ హనుమాన్లు, ఉపాధ్యక్షులు కర్లవార్ సాయిలు, అనుమువార్ హనుమాన్లు, కోశాధికారి తైదల్ చందర్, నాయకులు గ్రామ పెద్దలు సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ బాధ్యత కొడుకు, కోడలిదే..

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనసముందర్ గ్రామంలో బుధవారం ఆర్మూర్ ఆర్డీవో టీ.వినోద్ కుమార్ పర్యటించారు. గ్రామానికి చెందిన నల్ల గంగు (అత్త) వయో వృద్ధుల సంరక్షణ చట్టం కింద దరఖాస్తు చేసుకున్న విషయమై ఆర్డీవో గ్రామంలో పర్యటించారు. నల్ల గంగు తన కొడుకు గల్ఫ్‌లో ఉండడం వల్ల కోడలు నల్ల శారద తనను సరిగా చూసుకోవడం లేదని దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో ఆర్డీవో విచారించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయానికి శారదను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. వయో వృద్ధుల సంరక్షణ చట్టం, వయో వృద్ధుల పోషణ గురించి వివరించి, వారిని సరిగా చూసుకోవాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అర్జీ దారుల కుటుంబ సభ్యులు, సంఘ పెద్దమనుషులు, తహసీల్దార్ ఆంజనేయులు, సర్పంచ్ ఇంద్రాల రూప రాజేందర్, వైస్ ఎంపీపీ కాలేరు శేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీయూలో చదరంగం పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో అంతర్ కళాశాల చదరంగ పోటీలను తెలంగాణ వర్సిటీ క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ జి. బాలకిషన్ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ ఈ చదరంగ పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుండి ఆరు కళాశాలల నుండి 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సౌత్‌జోన్ అంతర వర్సిటీ పోటీలకు పంపనున్నట్లు వివరించారు. ఈ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ చెస్ చాంపియన్స్ -2024ను తమిళనాడులోని భారతి దాసన్ యూనివర్సిటీ చెన్నైలో ఈనెల 24 నుండి 29 వరకు నిర్వహిస్తారని తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ నుండి ఎం. సందీప్ ఎంఎ(ఏపిఈ), బి. రాకేష్ ఎంఎ తెలుగు), ఏ హనుమాన్ గుప్తా (నిషిత డిగ్రీ కళాశాల), ఎన్.సాయికుమార్ ఎంఎ (హిందీ), కే.శివసాయి ఎంఎ(ఏ పి ఈ) పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ చదరంగ క్రీడలకు తెలంగాణ యూనివర్సిటీ క్రీడా విభాగం సహా ఆచార్యులు (కాంటాక్ట్) డాక్టర్ బి.ఆర్ నేత కన్వీనర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు.

మమ్ములను గత ప్రభుత్వం పట్టించుకోలేదు

- యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన
- సమస్యల పరిష్కారంపై మంత్రి సీతక్కకు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీకి చెందిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సర్వీస్‌లను క్రమబద్ధీకరణ చేయడానికి గత ప్రభుత్వం పట్టించుకోలేదని బుధవారం నిర్మల్‌లో జరిగిన మహాసభలో మంత్రి సీతక్కకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో 12 యూనివర్సిటీలకు చెందిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని పంచాయతీరాజ్ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చినట్లు కాంట్రాక్టర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ వి.దత్తహరి తెలిపారు. త్వరలో జరగబోయే క్యాబినెట్ సమావేశంలో సమస్యలపై చర్చిస్తామని మంత్రి పేర్కొన్నట్లు వివరించారు. గత ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి చేయలేదని, దయచేసి తమ సర్వీస్‌ని గుర్తించి వెంటనే రెగ్యులరైజ్ చేయాలని మంత్రి సీతక్కకు వివరించారు. తెలంగాణ యూనివర్సిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా రెగ్యులరైజ్ చేయాలని పోరాటం చేసిన గత ప్రభుత్వం పట్టించుకోలేదని వారన్నారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ప్రెసిడెంట్ బట్టు సురేష్, జనరల్ సెక్రటరీ బికోజి, సుధీర్, సురేష్ రెడ్డి ,మదుల రెడ్డి, ఎన్ ఎస్ యు ఐ తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షులు శ్రీశైలం, రాజేందర్ సమక్షంలో మంత్రిని శ్రీహరి రావు అధ్యక్షతన ఖానాపూర్ ఎమ్మెల్యే సమక్షంలో నిర్మల్లో కలిసి విన్నవించారు.



మంత్రి సీతక్కకు సమస్యలను వివరిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్లు ప్రొఫెసర్లు

విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల
వినియోగదారులపై అదనపు భారం

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన

నవతెలంగాణ-రెంజల్

విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల వినియోగదారులపై అధిక భారం పడుతుందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రెంజల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రజినీ కిషోర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. విద్యుత్తు శాఖ సిబ్బంది ప్రతినెల ఒకటో తారీఖున రీడింగ్ తీయాల్సి ఉండగా, పదవ తారీకు వరకు రీడింగ్ తీస్తూ ఉండడంతో వినియోగదారులపై అదనపు భారం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం త్వరలో 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంట్ సరఫరా చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందేనని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ శాఖ అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేయాలని అన్నారు. రెంజల్ మండలంలో మండల విద్యాశాఖ అధికారి లేకపోవడంతో అనేక సమస్య ఏర్పడుతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి మండల విద్యాశాఖ అధికారి పోస్టును భర్తీ చేయాలని తెలిపారు.సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఉన్నత అధికారులకు పంపనున్నట్లు వారు పేర్కొన్నారు. మండలంలో12 ఆయా పోస్టులు, 2 అంగన్వాడి టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ నెలాఖరులోపు వాటిని భర్తీ చేయనున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీలారాణి తెలిపారు. యాసంగి సీజన్లో ఆరు విడతలుగా సాగునీటిని అందించనున్నట్లు ఏఈఈ బుజేందర్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రజనీ కిషోర్

నీటిని వృధా చేయకుండా మిగిలిన నీటిని చెరువుల్లోకి నింపుకోవాలని ఆయన సూచించారు. మాటు కాలువ నుంచి నీల వరకు సిసి పనులకు నిధులు మంజూరు కాగా అర్ధాంతరంగా వదిలివేశారని ఆప్షన్ సభ్యులు అంతయ్య సభ దృష్టికి తీసుకువచ్చారు. కందకుర్తి ఎత్తిపోతల పథకం అర్ధాంతరంగా నిలిచిపోయిందని, ట్రాన్స్ ఫార్మర్లు చెడిపోవడం వల్ల రైతులకు సాగునీరు అందడం లేదని ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫారం నమోదు చేయించాలని సభ్యులు కోరారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పెండింగ్‌లో ఉన్నాయని వాటినీ వెంటనే విడుదల చేయాలని సాటాపూర్ సర్పంచ్ వికార్ పాష ఐకెపి కార్యాలయంలో డ్వాక్రా గ్రూపులకు జరిగిన అవకత వతలపై సమగ్ర విచారణ జరిపించాలని రెంజల్ గ్రామ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ డిపోకు చెందిన బస్సులను సమయానుకూలంగా నడిపించాలని, ముఖ్యంగా విద్యార్థులకు నానా అవస్థలు పడుతున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి మేక విజయ సంతోష్, మండల ఉపాధ్యక్షులు ఖ్యాతం యోగేష్, తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో శంకర్, ఎంపీ ఓ గౌస్ ఉద్దీన్, ఆర్డబ్ల్యూఎస్ఈ గబ్బర్ సింగ్, ట్రాన్స్‌కో ఏఈ రాజలింగం, ఏవో లక్ష్మి కాంత్ రెడ్డి, పిఆర్ఏఈ వినయ్ కుమార్, నీటిపారుదల శాఖ ఏఈ బుజేందర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, డాక్టర్ వినయ్ కుమార్, ఎస్టీవో రజిత, ఎంపీటీసీలు లక్ష్మి రుక్మిణి, అసాద్ బేగ్, సంయుక్త, సర్పంచులు పాల్గొన్నారు.

సర్పంచ్లకు ఘన సన్మానం

సర్పంచుల పదవీకాలం ఈనెలాఖరులోపు పూర్తి కానుండడంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం అనంతరం ఎంపీపీ రజినీకిషోర్, మండల కార్యాలయం అధికారులు సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రజని కిషోర్ మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలుగా గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులు నానా అవస్థలు ఎదుర్కొంటూ అభివృద్ధి పనులు చేశారని, వారి పెండింగ్ బిల్లుల విషయంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆమె అన్నారు. సర్పంచులు తమ సొంత ఇంటి లాగా గ్రామాన్ని తీర్చిదిద్దారని ఆమె అభినందించారు. పదవీకాలం అనంతరం వారికి రావాలసిన డబ్బుల విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో శంకర్, పంచాయతీరాజ్ వినయ్ కుమార్, ఎంపీ ఓ గౌస్ ఉద్దీన్, సూపరిడెంట్ శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



సర్పంచులను సన్మానిస్తున్న అధికారులు

సమస్యలు వెలికితీయడంలో 'నవతెలంగాణ' ముందుంది

- ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ భట్, ఎంపిడిఓ రాములు నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే వెలికి తీయడంలో నవతెలంగాణ ముందుంటుందని, రాబోవు రోజుల్లో నవతెలంగాణ ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించే విధంగా చొరవ తనవంతు పాత్ర పోషించాలని ఇందల్ వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ భట్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాములు నాయక్ అన్నారు. బుధవారం ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో నవతెలంగాణ దినపత్రిక 2024వ సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవతెలంగాణలో వచ్చే వార్తలు, విశ్లేషణలు ఎంతో స్ఫూర్తి దాయకంగా ఉంటాయని, నిష్పక్షపాతంగా వ్యవహరించడం అభినందనీయ మన్నారు. ప్రజా సమస్యలు వెలికితీస్తూ ప్రజలకు, అధికారులకు వారధిగా ఉంటూ మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ఎ.శ్రీనివాస్, ఉమ్మడి డిచ్‌పల్లి విలేకరి సయ్యద్ నయీమోద్దీన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

టీఎస్‌యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) క్యాలెండర్‌ను బాల్కొండ మండల అభివృద్ధి కార్యాలయం లో ఎంపిడిఓ సంతోష్ కుమార్ ఎంఇఓ రాజేశ్వర్, యుటిఎఫ్ నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు 8 సంవత్సరాలుగా పదోన్నతులు లేక ఒకే క్యాడర్‌లో పదవీ విరమణకు దగ్గరగా ఉన్నారని, తీరా ఇప్పుడేమో టెట్ అర్హత ఉండాలంటూ ఆందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. టెట్ నుండి మినహాయింపునిచ్చి ఉపాధ్యాయ పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యుటియఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.రఘు, బోయిడా నర్సయ్య నాయకులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ పాఠశాలలో విజ్ఞాన మేళ



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ క్షత్రీయ పాఠశాలలో బుధవారం విజ్ఞాన మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని క్షత్రీయ విద్యా సంస్థల కార్యదర్శి శ్రీ అల్జాపూర్ దేవేందర్ జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. వేదిక పైన ఉపాధ్యక్షుడు అల్జాపూర్ లక్ష్మీనారాయణ, కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, స్కూల్ డైరెక్టర్లు అల్జాపూర్ వీరేంద్ర, జయంత్, అక్షయ్, పరీక్షిత్, స్కూల్ ప్రిన్స్‌పాల్ లక్ష్మీనరసింహస్వామి ఉన్నారు. నర్సరీ తరగతి నుండి తొమ్మిది తరగతి విద్యార్థులు ఈ విజ్ఞానమేళాలో పాల్గొన్నారు. ఈ విజ్ఞాన మేళాలో విద్యార్థులు మొత్తం వివిధ విషయాలకు సంబంధించిన 356 నమూనాలను ప్రదర్శించినారు. ఈ సందర్భంగా కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ విద్యార్థులలో అంతర్లీనంగా దాగియున్న ప్రతిభను వెలికి తీయడానికి ఈ విజ్ఞానమేళా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కోశాధికారి శ్రీ గంగాధర్ గారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లోను ప్రతిభ దాగి ఉంటుందని ఆలా దాగియున్న ప్రతిభను వెలికి తీయడమే గురువుల కర్తవ్యమని అన్నారు.

క్షత్రియ విద్యాసంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ తమ సందేశాన్ని పంపిస్తూ పాఠశాల విద్యా విషయాలతో పాటుగా జ్ఞానాన్ని పెంపొదించేందుకు ఉపయోగపడే విజ్ఞానమేళా లాంటి కార్యక్రమం, విద్యార్థుల శారీరక పటుత్వం పెరగడానికి ఉపయోగపడే క్రీడలను నిర్వహించడానికే ముందుంటుందని అన్నారు. ఈ సందర్భంగా అద్భుతమైన ప్రదర్శనలు చేసిన విద్యార్థులను అభినందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ నరసింహ స్వామి మాట్లాడుతూ.. విజ్ఞానమేళా కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా అధిక జ్ఞానాన్ని పొందుతారని, ఇతర విద్యార్థులు రూపొందించిన వాటిని గమనించి కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటారని అన్నారు. కార్యక్రమం విద్యార్థులలో ఐక్యతా భావం, సోదరభావం పెంపొందుతుందని, తమ ప్రదర్శనను వివరించడం ద్వార వాక్చాతుర్యం పెరుగుతుందని ప్రిన్సిపల్ అన్నారు. కార్యక్రమంలో అరుంధతి, శైలజ తదితర ఉపాధ్యాములు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముస్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని
12న ధర్నా : బిఎల్‌టీయూ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ముస్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆ లోపు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న ఉముస్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (బిఎల్‌టియు) ఆధ్వర్యంలో నిజామాబాద్ ముస్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ బుధవారం ముస్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బహుజన ముస్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, నగర నాయకులు ఎ.హరీష్, సహదేవ్ పాల్గొన్నారు.

హిందీ దివస్ వేడుకలు



ముప్కాల్‌లో..

నవతెలంగాణ-ఆర్మూర్/ముప్కాల్

ప్రపంచ హిందీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం భూషణ్ సంపూర్ణ పరీక్షలు రాసిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా పట్టణ హిందీ కేంద్ర వ్యవస్థాపకురాలు డీజే శాంతి మాట్లాడుతూ హిందీ భాష ప్రావీణ్యానికి నిర్విరామ కృషి చేస్తున్నట్లు చెప్పారు. మొట్టమొదటిసారిగా ప్రపంచ హిందీ దినోత్సవం 1975 సంవత్సరం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అక్సరి బేగం, వైస్ ప్రిన్సిపాల్ దేవారం, అధ్యాపకులు ఇర్ఫానా పార్లీన, స్వాతి, నవీన్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా "ఇంటర్నేషనల్ హిందీ దివాస్

ముప్కాల్:ముప్కాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం "ఇంటర్నేషనల్ హిందీ దివాస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు హిందీ భాష యొక్క గొప్పతనాన్ని వివరించినట్లు ప్రిన్సిపాల్ వినోద తెలిపారు. కల్చరల్ ఆక్టివిటీస్ సైతం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్. వినోద, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌డిసిసిబి క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్, అధికారులు, డీజీఎంలు, ఏజీఎంలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో (ఎన్ డీసీసీబీ) 2024 క్యాలెండర్, డైరీని పాలక వర్గ సభ్యులతో కలిసి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చంద్ర శేఖర్ రెడ్డి, సాయి కుమార్, శరత్, శాంతిశ్వర్ పటేల్, భూమన్న, లింగన్న, మోతీలాల్, శంకర్, ఆనంద్, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్ కుమార్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల డిసిఓ సింహాచలం, బ్యాంకు సిఇఓ నాగభూషణం, డీజీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



హెచ్ఎం, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు, వీడీసీ సభ్యులు

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని నాలేశ్వర్ ఉన్నత పాఠశాలనుండి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సర్పంచ్ సరీన్ బుధవారం సన్మానించారు. బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయురాలు సునీత ఉపాధ్యాయులు నవీన్, విద్యాసాగర్లను సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పి ఆర్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్ రావు, ఎంపీటీసీ శ్యామల, ఉపసర్పంచ్ లక్ష్మణ్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఉంటూ ప్రాణాలను కాపాడుకోవాలి

- రూట్ ఆపరేషన్ మేనేజర్ నీరజ్ దేశ్ పాండే



అవగాహన కల్పిస్తున్న నీరజ్‌దేశ్‌పాండే

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అతివేగం, మద్యం, రాంగ్ రూట్, మూలమలుపుల వద్ద జాగ్రత్తగా ఉంటు వాహనాలు నడిపి తమ ప్రాణాలను కాపాడుకోవాలని అత్వంగ్ డిచ్‌పల్లి టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ రూట్ ఆపరేషన్ మేనేజర్ నీరజ్ దేశ్ పాండే అన్నారు. బుధవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ లో సేఫ్టీ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వాహనదరుడు తమ ప్రాణాలను కాపాడుకుంటూ వాహనాలను నడపాలని, మద్యం సేవించి, అతివేగంతో మూల మలుపుల వద్ద, హెల్మెట్ సీటు బెల్టులు ధరించకుండా వెళ్లి లేని ప్రమాదాలను కొని తెచ్చుకొని కుటుంబాలకు జీవితాంతం కష్టాల్లో నెట్ట వద్దని పేర్కొన్నారు. జాతీయ రహదారి వద్ద ఉన్న టోల్ ప్లాజా ఆధ్వర్యంలో వాహనదారులకు అందజేసే సహాయ సహకారాలను వివరించారు. రాంగ్ రూట్లో వెళ్లి ఇబ్బందులు పడి ఇతరులకు ఇబ్బందులకు గురి చేయవద్దని అన్నారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేఫ్టీ అధికారి పి.సతీష్, మేనేజర్ వీరబాబు, టోల్‌ప్లాజా సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో
సంక్రాంతి సంబరాలు

- ముగ్గులువేసి, పతంగులు ఎగురవేసిన విద్యార్థులు



సాయిప్రసన్న హైస్కూల్లో భోగి మంటలు వేస్తున్న ఉపాధ్యాయినులు

నవతెలంగాణ - బోధన్

బోధన్ పట్టణంలోని సాయి ప్రసన్న హైస్కూల్లో బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు సంక్రాంతి పండగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి నిర్వహించే విధానంతో వివిధ వేషాధారణలో విద్యార్థులు అలరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు భోగి మంటలు వేసి పండగ ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పూదోట జయప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

ఆర్మూర్ :పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి.ధనవేణి మాట్లాడుతూ.. విద్యార్థినుల్లో ప్రతిభ సృజనాత్మకతల కలబోతతో రంగవల్లులను తీర్చిదిద్దడం హర్షనీయమని అన్నారు. విద్యార్థుల జీవితాలలో ప్రతిభ సృజనాత్మకతల పోటీ తత్వం పెరిగి విద్యారంగంలో రాణించాలని కోరారు. గాలి పటాలను సైతం ఎగరవేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శరణ్య అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

జెంటిల్ కిడ్స్ పాఠశాలలో



జెంటిల్‌కిడ్స్ పాఠశాలలో..

పట్టణం లో గల జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్ యందు సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో విద్యార్థినులు రంగురంగుల ముగ్గులు వేశారు. విద్యార్థులందరూ పతంగులు ఎగురవేస్తూ సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ లయన్ గుజరాతి ప్రకాష్ మాట్లాడుతూ సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు ప్రిన్సిపాల్ లత అధ్యాపక బృందం బొమ్మల కొలువు ఆటపాటలతో పండుగ సంబరాలు చూడ ముచ్చటగా జరుపుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | జనవరి 11, 2024 | www.navatelangana.com

చెరువును కబ్జాదారుల నుండి కాపాడండి

• అధికారులకు విన్నవించిన గ్రామ అభివృద్ధి కమిటీ

నవతెలంగాణ-బాల్కొండ
బాల్కొండ గ్రామంలో పెద్ద చెరువును ఆక్రమించుకున్నారని, సర్వే చేయించి భూ కబ్జాదారుల నుండి చెరువును కాపాడాలని బుధవారం తహసిల్దార్ శ్రీధర్‌కు, ఇరిగేషన్ శాఖ అధికారులకు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిప్పెర అశోక్ ,ప్రధాన కార్యదర్శి తోటగంగా కిషన్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

మొరం తరలిస్తున్న టిప్పర్లు, జెసిబిలు పట్టివేత

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని ఆదర్శ పాఠశాల వెనుక భాగంలో మొరం తరలిస్తున్న ఏడు టిప్పర్లు, రెండు జెసిబిలను టాస్క్ ఫోర్స్ సీఐ ఆంజనేయులు అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సునీతకు అప్పగించారు. కాంట్రాక్టర్ ఈ మొరంను అధికారుల అనుమతితో తరలిస్తున్నట్లు తెలిసింది. టాస్క్ ఫోర్స్ సీఐ తన సిబ్బందితో వాటిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.


పట్టుకున్న టిప్పర్లు, జేసీబీలు

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

• ఫిబ్రవరి 7న ఓటర్ల తుది జాబిత
• రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

నవతెలంగాణ-కామారెడ్డి
రాబోవు పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. బుధవారం తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీలతో స్పెషల్ సమ్మరి రివిజన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఎన్నికలకు ముందు అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదుకు అవకాశం కల్పిస్తూ భారత ఎన్నికల సంఘం స్పెషల్ సమ్మరి రివిజన్ నిర్వహిస్తుందని అన్నారు. ఫిబ్రవరి 8 న తుది ఓటరు జాబితా ప్రకటించనుందని, ఆలోగా కొత్తగా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు ఒక మాసం అవకాశముందని అన్నారు. ఆ ఇతరువాత కూడా నామినేషన్ రోజు వరకు ఓటరు నమోదుకు అవకాశమున్నా అనుబంధ జాబితా వెలువడుతుందని, కాబట్టి ఇదే అవకాశంగా ప్రతి పోలింగ్ బూతు స్థాయిలో ఏజెంట్ లను నియమించి ముసాయిదా ఓటరును పరిశీలించి అభ్యంతరాలు ఉంటె తెలుపవలసినదిగా కోరారు. ఇటీవలే శాసనసభ ఎన్నికలు ముగిసిన దరిమిలా ప్రజలకు పోలింగ్ కేంద్రాలపై ఒక స్పష్టమైన అవగాహన ఉందని, కాబట్టి పార్లమెంటు ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల మార్పులు చేపట్టవద్దని ఎన్నికల సంఘం సూచిందని, మన జిల్లాలో ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1450 మంది ఓటర్లకు మించి లేనందున యథావిధాగా పోలింగ్ కేంద్రాలలోనే ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. గత శాసన సభ ఎన్నికల సందర్భంగా గుర్తించిన అంశాలను పరిగణలోకి తీసుకొని డూప్లికేట్‌ఓటర్లను, చనిపోయిన ఓటర్లను, సిమిలర్ ఫోటో ఎంట్రీ, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీ ఓటర్లను గుర్తించామని, వారికి స్పీడ్ పోస్ట్ ద్వారా నోటీసులు ఇచ్చి తొలగిస్తామన్నారు. వివిధ పోలింగ్ కేంద్రాలలో ఉన్న ఒకే కుటుంబం వారు బయటి వెళ్ళారా, ఉన్నారా గుర్తించి వారి అంగీకారంతో ఈ నెలాఖరు నాటికి ఒకే పోలింగ్ కేంద్రానికి షిఫ్ట్ చేయుటకు బూతు స్థాయి అధికారులు సమాయత్తంతో పనిచేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 20, 21 తేదీలలో స్పెషల్ క్యాంపైన్ నిర్వహిస్తున్నామని, ల్పోలింగ్ కేంద్రాలలో బూతు స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు నిర్ణీత ఫారాలలో దరఖాస్తు చేసుకునేలా చోడాలని, వాయేటన్నింటిని ఫిబ్రవరి 2 లోగా పరిష్కరించి 8 న తిది ఓటరు జాబితా విడుదల చేస్తామని అన్నారు. ముసాయిదా ఓరు జాబితా ప్రకారం జిల్లాలో 3,29,005 మంది పురుషులు, 3,48,112 మంది మహిళలు, 34 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల వేళ అభ్యర్తులు ప్రచార నిమిత్తం ఉపయోగించే టెంట్ సామాగ్రి, లౌడ్ స్పీకర్ లైటింగ్,వాహనాలు, క్రాకర్లు, డెకరేషన్ మెటీరియల్, ఫ్లెక్సీలు, పోస్టర్లు , కరపత్రాలు తదితర వాటికి నిర్ధారించిన రేట్ కార్డు జాబితాను రాజకీయపార్టలకు అందజేశారు. ప్రచారం సందర్భంగా ఒక ఎల్.ఈ.డి. స్క్రీన్ తో ఉపయోగిస్తున్న వాహనానికి 4,500 అద్దె, ప్రతి అదనపు ఎల్.ఈ.డి. స్క్రీన్ ఏర్పాటుకు అదనంగా వేయి చొప్పున ధర నిర్ధారించిన వాటికి రాజకేయ పార్టీలు సమ్మతి తెలిపాయి.

ఈ సమావేశంలో రాజకీయ పార్టల ప్రతినిధులు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, మదన్ లాల్ జాదవ్, అవధూత నరేందర్, కాసిం అలీ, బాటనికి బాలరాజ్, అనిల్ కుమార్, ఎలక్షన్ సుపీరింటెండెంట్ అనిల్ కుమార్, ఎన్నికల సిబ్బంది జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని కూనేపల్లి గ్రామానికి చెందిన సుద్ద సతీష్ అనే యువకుడు స్థానిక చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని హెడ్ కానిస్టే బుల్ సునీత తెలిపారు. మృతుడికి ఇటీవలే పాప జన్మించడం తో ఇంట్లో శుభకార్యం జరగడంతో మృతుడు మద్యం విపరీతంగా సేవించాడు. కుటుంబీకులు ఆయనను మందలించగా మద్యం మత్తులో ఉన్న యువకుడు స్థానిక చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆమె తెలిపారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.


మృతి చెందిన సతీష్

ఇసుక, మొరం ట్రాక్టర్లు సీజ్

నవతెలంగాణ-ఏర్గట్ల
మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్, తాళ్ళ రాంపూర్ గ్రామానికి చెందిన మొరం ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై మచ్చేంధర్ రెడ్డి బుధవారం తెలిపారు. మండలంలో అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే కఠిన చర్యలుంటాయని అన్నారు.



ఆలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం



నవతెలంగాణ-కమర్‌పల్లి
మండల కేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయానికి మండలంలోని హాస కొత్తూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ.25వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు బుధవారం విరాళం మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, సురంగి చంద్రశేఖర్, మల్యాల సుభాష్ గౌడ్, ఆక్స్ ఫర్డ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగవ రోజు హెూరాహెూరీ పోరు

• ఉత్కంఠ భరితంగా సాగుతున్న కబడ్డీ పోటీలు


పోటీకి సిద్దమవుతున్న క్రీడాకరులు


నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి జిల్లా కేంద్రంలో‹ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న అండర్ 17 బాలుర కబడ్డి పోటీలు నాలుగవ రోజు హెూరాహెూరీగా కొనసాగాయి. జిల్లా కేంద్రంలో జరుగుతున్న కబడి జాతీయ పోటీలు ఉత్కంఠ భారీతంగా సాగుతున్నాయి. నాలుగవ రోజైన బుధవారం జరిగిన ఫ్రీ క్వార్టర్లో హిమాచల్ ప్రదేశ్ పై తెలంగాణ రెండు పాయింట్లతో విజయం సాధించింది. హర్యానా మహారాష్ట్రతో పోటీ పడగా మహారాష్ట్ర పై ఏడు పాయింట్లుతో హర్యానా విజయం సాధించింది. విద్యా భారతి, కర్ణాటక పోటీ పడగా విద్యా భారతి పై 21 పాయింట్లుతో కర్ణాటక విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ నువ్వా నేనా అన్నట్లు పోటీ ఉత్కంఠ భరితంగా సాగింది చివరక‹ ఢిల్లీ 2 పాయింట్లతో ఉత్తర్ ప్రదేశ్ పై విజయాన్ని సొంతం చేసుక‹ంది.

కర్ణాటక వర్సెస్ ఢిల్లీ మధ్య జరిగిన తొలి సెమీఫైనల్ లో 50%--%43 స్కోర్ తో కర్ణాటక 7 పై%శీ%ట్ల తేడాతో ఢిల్లీ పైన కర్ణాటక విజయం సాధించింది.

హర్యానా వర్సెస్ తెలంగాణ మధ్య జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్ లో 59%--%30 స్కోర్ తో హర్యానా 29 పై%శీ%ట్ల తేడాతో తెలంగాణ పైన విజయం సాధించింది. గురువారం ఉదయం 11 గంటల నుండి ఫైనల్ మ్యాచ్లు జరుగుతాయ‹ ఎస్ జి ఎఫ్ నాయక‹లు తెలిపారు.

దొంగ దొరికిండు..

• ఊపిరి పీల్చుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి
గొలుసు దొంగతనం కేసులో పట్టుబడి డిచ్‌పల్లిలో పోలీస్ కస్టడి నుంచి పారిపోయిన దొంగ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఏసీపీ కిరణ్‌కుమార్ బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. హర్యానాకు చెందిన సాహిల్‌ఖాన్, మహ్మద్ అర్షద్ జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నారు. ఈ 4వ తేదీనా మధ్యాహ్నం జక్రాన్‌పల్లి బస్టాండ్ వద్ద బస్‌కోసం ఎదురుచూస్తున్న చౌకె సువర్ణను అడ్రస్ అడిగినట్టు చేసి ఆమె రెండు తులాల పుస్తెల తాడును ఎత్తుకెళ్లారు. సువర్ణ కొడుకు సంతోష్ ఫిర్యాదుమేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా.. గన్య తండా వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్నారని నమ్మదగిన సమాచారం 9వ తేదీనా సాయంత్రం ఆరుగంటలకు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. నిందితులు తాము చేసిన నేరాన్ని అంగీకరించారు. నేరాలు చేసేందుకు బైక్‌ను సైతం డిసెంబర్‌లో హర్యానాలో చోరీ చేశారు. తెలంగాణలో మహిళలు ఎక్కువగా బంగారం ధరిస్తారని చోరీ చేసేందుకు వచ్చారు. వీరిపై పలు స్టేషన్‌లలో చోరీ కేసులు నమోదు అయ్యాయి.

బాలిక విద్యను ప్రోత్సహించాలి

• ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ


విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంపీ

నవతెలంగాణ-బోధన్
ప్రతి కుటుంబంలో బాలిక విద్యను ప్రోత్సహించాలని ఎంఐఎం పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ఆయేషా గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మైనార్టీ విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. విద్యతోనే జీవితంలో ఏదైనా సాధించగలమని పేర్కొన్నారు. మహిళలపై వివక్ష చూపకుండా వారికి ఇంటికి పరిమితం చేయకుండా అన్ని రంగాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి అన్నారు. అనంతరం ఉర్దూ మీడియం పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మోడల్ పేపర్ బుక్‌లను పంపిణీ చేశారు. స్థానిక నాయకులతో రాజకీయ అంశాలపై చర్చించి, రెంజల్ బేస్‌లోని జలాల్ బుఖారి దర్గాను దర్శించుకున్నారు. ఆయనను కౌన్సిలర్ శరత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాషా మోహినోద్దీన్, ఖలీల్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఐఎం పట్టణాధ్యక్షుడు ముషీర్ బాబా, కౌన్సిలర్ శర్భార్ట్, వలీవుద్దీన్, సమీర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్లను ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రాజాగౌడ్

నవతెలంగాణ-బోధన్
తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూ) క్యాలెండర్లను బుధవారం బోధన్ ఆర్డీవో రాజా గౌడ్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజోద్ధారకులని ఉన్నత లక్ష్యంతో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే నూతన సంవత్సర సందర్భంగా ఎంతో మంచి లక్ష్యంతో క్యాలెండర్లను తీసుకురావడం అభినందనీయమన్నారు. అలాగే రాబోయే వార్షిక పరీక్షల్లో ప్రతి పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలని, ఆ విధంగా విద్యార్థులను తయారు చేయాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆర్డీవో రాజ గౌడ్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు సలీం, కార్యదర్శి కిషోర్, జిహెచ్ఎస్ (జెసి) ప్రధానోపాధ్యాయులు బాలచందర్, ఆర్థిక కార్యదర్శి వాహెద్, రాజేశ్వర్ ,జావీద్, మేరాజ్ ,ఓబైద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు కేంద్రపథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి
కేంద్ర ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అర్హులైన వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఇందల్ వాయి మండలంలోని మల్లాపూర్, లోలం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చెందేలా చూడాలని వివరించారు. ఉజ్వల పథకంలో భాగంగా రేషన్ కార్డు కలిగి ఉండి గ్యాస్ లేనివారికి ఉచితంగా గ్యాస్ సిలిండర్, పొయ్యి పొందవచ్చని అన్నారు. ఇదే కాకుండా 700రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందజేస్తారని వివరించారు. ఇళ్ళు లేని వారికి ఇళ్ళ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం 2లక్షలు అందజేస్తుందని తెలిపారు. గ్యాస్ లేని వారు ముందుగా దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ లో జిల్లాలో ఉన్న పలు ఆస్పత్రుల్లో 5 లక్షల వరకు చికిత్స చేయించుకోవచ్చని సూచించారు. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ఆయా శాఖల అధికారులు వివరించారు.

ఉపాధి డబ్బులు రాలేదని లొల్లి..

వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా లోలం గ్రామంలో ఆయాశాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వం పథకాలను వివరించారు. దానిలో భాగంగానే ఉపాధి హామీలో భాగంగా టెక్నికల్ అసిస్టెంట్ ఉపాధి వివరాలు తెలుపుతుండగా కొందరు గ్రామస్తులు అడ్డు తగులుతూ నెలల తరబడి ఉపాధి పనులు చేసిన డబ్బులు రావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వికసి భరత్ సంకల్పం యాత్ర సభను ముగించారు. ఎన్నిసార్లు కార్యాలయల చుట్టూ తిరిగిన డబ్బులు రావడంలేదని ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి ఉందని వారు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల కన్వీనర్ లోలం సత్యనారాయణ, లలిత శేఖర్, ఎంపిటిసి సరిత సుదిర్, కార్యదర్శులు అనుష, సువార్త, అధికారి ఆంజనేయులు చలమని ఏపిఎం సువర్ణ, సతీష్, అధికారులు పాల్గొన్నారు.


సంకల్ప యాత్రలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

గృహాలక్ష్మి పథకం ప్రొసీడింగ్‌లు రద్దుచేయొద్దు

• తహశీల్దార్లకు వినతి

నవతెలంగాణ-బాల్కొండ/ఏర్గట్ల
గత ప్రభుత్వ హయాంలో మంజూరైన గృహలక్ష్మి పథకం కింద మంజూరైన ప్రొసీడింగ్ కాపీలు రద్దు చేయవద్దని, ఆ పథకాన్ని అలాగే కొనసాగించాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని 10 గ్రామాలకు చెందిన గత ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మీ పథకం కింద మంజూరైన లబ్ధిదారులు స్వంత ఇల్లు లేక ఖాళీ జాగా ఉన్న పేద కుటుంబాలకు చెందిన వాళ్లమని అన్నారు. కిరాయి ఇండ్లలో జీవిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అర్హులైన మమ్మల్ని గుర్తించి మూడు లక్షలు మంజూరు చేశారని కాబట్టి ఆ పథకాన్ని అలాగే కొనసాగించాలని అన్నారు. ఈ ప్రభుత్వం దీనికి సంబంధించి రూ.5 లక్షల మంజూరు చేస్తామని ప్రకటించారని, కావున ఇంతకుముందు మంజూరు అయిఉన్నాం కాబట్టి ఇచ్చే పథకంలో అదనంగా డబ్బులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు నిర్మించుకోవడానికి 3 లక్షల రూపాయల రుణం కోసం ఇచ్చిన ప్రొసీడింగ్ కాపీలను నూతన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో లబ్దిదారులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. గత ప్రభుత్వంలో మంజూరైన ప్రొసీడింగ్ కాపీలను కొనసాగించాలని ఎమ్మార్వో మహమ్మద్ యూసుఫ్‌కు లబ్ధిదారులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఏర్గట్ల : తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన లబ్దిదారులు

తాగునీటి సమస్య తలెత్తొద్దు

• మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీర్
• అధికారులతో సమీక్షించిన మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్
తాగు నీటి సరఫరా విషయంలో శ్రద్ధ వహించాలని నీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను నగర మేయర్ దండు నీతూ కిరణ్ ఆదేశించారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్లో మున్సిపల్ ఇంజినీర్ అధికారులతో, పారిశుధ్ధ సిబ్బందితో సమావేశం బుధవారం నిర్వహించారు. పారిశుధ్ధ పనులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, చెత్త నిర్వహణపై ప్రజలలో అవగాహన కల్పించాలని రోడ్లపై చెత్త వేయకుండా చెత్త వాహనాలను విధిగా కాలనీలలో తిప్పాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ మురళి మోహన్ రెడ్డి, ఇంజినీర్లు మురళి, శంకర్, సల్మాన్ ఖాన్, ఇంచార్జి ఎం.హెచ్.ఓ సాజిద్ అలీ, సానిటరీ ఇన్స్పెక్టర్స్ ప్రభుదాస్, సల్మాన్ రాజ్, ప్రశాంత్, శ్రీకాంత్, సునీల్, మహిపాల్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ నీతు కిరణ్